RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | ఆదివారం, అక్టోబరు 4, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 153 | పేజీలు: 8 | వెల : రూ.1



## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

# మహిళలు, పిల్లల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత

### పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం: సీఎం రేవంత్



హైదరాబాద్: మహిళలు, పిల్లల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలకు గురికాకుండా భద్రత, సంరక్షణ కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం: ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం' అనే అంశంపై దక్షిణాది ప్రాంతీయ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. డిజిటల్ వేదికలపై పిల్లల రక్షణ కోసం న్యాయ సేవా సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేర్చేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని సీఎం తెలిపారు. పిల్లల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

**పలు వ్యవస్థల సమన్వయంతో రక్షణ**

పిల్లలు, మహిళల రక్షణ కోసం పోలీసులు, భరోసా కేంద్రాలు, బాలల సంరక్షణ విభాగాలు, బాలల సంక్షేమ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు తదితర వ్యవస్థలు పనిచేస్తున్నాయని సీఎం వివరించారు. భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకేచోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలో తొలి బాలల అనుకూల న్యాయస్థానాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీసు శాఖలోని మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో షీ-భరోసా సైబర్ ప్రయోగశాలలు పనిచేస్తున్నాయని,

- మిగతా 2వ పేజీలో



# పేదలకు 5 వేల ఇళ్లు.. రూ.300 కోట్లతో నిర్మాణం

### తాన్లా ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయం: మంత్రి పొంగులేటి

### పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటన.. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఖమ్మం, అక్టోబరు 3 (వాయిస్ టుడే): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి దాతృత్వ సంస్థలు కూడా సహకరించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో రూ.300 కోట్లతో 5 వేల ఇళ్లను నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయిస్తే.. తాన్లా ఫౌండేషన్ తరఫున ఉదయ్ కుమార్ రెడ్డి సొంత నిధులతో ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దసరా రోజున ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు సమన్వయంతో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**నేలకొండపల్లిలో అభివృద్ధి పనులు**

నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో రూ.25 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. మండలంలోని 31 మంది కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

**క్యాన్సర్ ఆస్పత్రి పనుల పరిశీలన**

సత్తుపల్లి నియోజకవర్గం నారాయణపురంలో శ్రీ షిరిడి సాయి జన మంగళం ట్రస్టు సహకారంతో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం జరుగుతున్న క్యాన్సర్ ఆస్పత్రి నమూనాలను పరిశీలించారు. బేతుపల్లి గంగారం గ్రామంలో తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ల్యాబొరేటరీలను సందర్శించారు. అక్కడ రక్తపరీక్ష చేయించుకుని, రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు.

**సత్తుపల్లి మున్సిపాలిటీలో పనులకు శంకుస్థాపన**

సత్తుపల్లి మున్సిపాలిటీలోని 12వ వార్డు ద్వారకాపురి కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు, 14వ వార్డు గాంధీనగర్‌లో రూ.40.50 లక్షలతో చేపట్టనున్న పనులకు, 1వ వార్డు గుడిపాడులో రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. తల్లాడ మండలం పినపాకలో అర్హులైన 79 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణ, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత



- చెన్నైలో తుదిశ్వాస విడిచిన సింగీతం శ్రీనివాసరావు (94)
- ఆరు దశాబ్దాల కెరీర్‌లో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం
- పుష్పక విమానం, ఆదిత్య 369, మయూరి వంటి ప్రయోగాత్మక చిత్రాలతో చరిత్ర సృష్టించిన వైనం
- 94 ఏళ్ల వయసులోనూ 'సింగ్ గీతం' అనే చిత్రానికి దర్శకత్వం వహించి రికార్డు
- ఆయన మృతికి సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం



# రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది : హరీశ్

**నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు**

**రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు**

**ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా**

నర్సాపూర్ : మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆంఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని

- మిగతా 2వ పేజీలో

# తెలంగాణలో సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాసులు!

- పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- మహిళల మాదిరిగానే వృద్ధులకూ ఈ సౌకర్యం కల్పించేందుకు కసరత్తు
- త్వరలోనే అమలు చేస్తామన్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అర్హతలు, విధివిధానాలు ఖరారుపై దృష్టి
- ప్రస్తుతం రాష్ట్రంలో 48లక్షలమంది వృద్ధులు ఉన్నట్లు అంచనా




# ఏపీకి 23 ఐఐటీల టెక్నాలజీ.. చంద్రబాబు సమక్షంలో డిక్లరేషన్!

- ఏపీకి టెక్నాలజీ బదిలీ చేసేందుకు 23 ఐఐటీల అంగీకారం
- అమరావతి కేంద్రంగా పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్లతో వెంచర్ ఫండ్
- క్యు-శివ పేరుతో ఐదు క్వాంటం కంప్యూటర్ల ఆవిష్కరణ
- 2027 ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్లు




అమరావతి : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, సాంకేతిక ప్రగతికి ఊతమిచ్చేలా దేశంలోని 23 ఐఐటీలు ముందుకొచ్చాయి. రాష్ట్రానికి అవసరమైన టెక్నాలజీని బదిలీ చేసేందుకు

- మిగతా 2వ పేజీలో

# మీ వెన్నంటి భారత్ ఉంది: పీయూష్ గోయల్

### అమెరికాలో ప్రవాస భారతీయులకు కేంద్ర మంత్రి భరోసా



షికాగో: ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, ఎలాంటి కష్టాల్లో చిక్కుకున్నా ప్రవాస భారతీయులకు భారత్ అండగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. "మీ వెన్నంటి భారత్ ఉంది" అంటూ అమెరికాలోని ప్రవాస భారతీయులకు భరోసా ఇచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో పర్యటించిన పీయూష్ గోయల్.. స్కోకీలోని మహాత్మా గాంధీ స్మారక విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ప్రవాస భారతీయులతో సమావేశమై మాట్లాడారు. గతంలో యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాల సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రత కోసం భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలను గోయల్ ప్రస్తావించారు. ప్రపంచంలో ఏ దేశంలో, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా మాతృభూమి భారతీయులకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రవాసుల కుటుంబాలు, పిల్లలకు కూడా భారత్ తోడుగా నిలుస్తుందని చెప్పారు. భారత్--అమెరికా సంబంధాల్లో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషిస్తున్నారని గోయల్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వారు "జీవ వారధులు"గా వ్యవహరిస్తున్నారని అన్నారు. అమెరికాలోని ప్రతి ప్రవాస భారతీయుడు భారతదేశానికి ఒక ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. అమెరికాను తమ స్వీకరించిన దేశంగా గౌరవిస్తూ నిజాయతీగా, నిబద్ధతతో సేవ చేయాలని ప్రవాస భారతీయులకు సూచించారు. అదే సమయంలో మాతృభూమిని, భారత ప్రజలను తమ హృదయంలో పదిలంగా ఉంచుకోవాలని కోరారు. షికాగో పర్యటనలో భాగంగా 1893లో స్వామి వివేకానంద చారిత్రాత్మక ప్రసంగం చేసిన ఫుల్లర్టన్ హాల్‌ను కూడా పీయూష్ గోయల్ సందర్శించారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు

ఆదివారం, అక్టోబరు 4, 2026

# మహిళలు, పిల్లల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత



సైబర్ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను సైబర్ రాయబారులుగా తీర్చిదిద్ది తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

### 3 వేల మందికి పైగా అధికారులకు శిక్షణ

బాధిత పిల్లలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం వంటి చర్యలు తీసుకుంటున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. ఉపాధ్యాయులు పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారని, ఇప్పటివరకు 3 వేల మందికి పైగా బాలల సంరక్షణ అధికారులకు శిక్షణ ఇచ్చామని సీఎం తెలిపారు.

### తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం

పిల్లలు సైబర్ నేరాల బారిన పడకుండా నిర్వహించే కార్యక్రమాల్లో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేయాలని సీఎం సూచించారు. పిల్లలను తప్పుబట్టే ధోరణికి బదులుగా వారికి అవగాహన కల్పిస్తూ మద్దతుగా నిలవాలని అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1930, బాలల సహాయ కేంద్రం కోసం 1098 నంబర్లను పిల్లలు, తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని సూచించారు. పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు అందరూ కలిసి పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జరిగే చర్చలు, సూచనలు, సిఫారసులు దేశవ్యాప్తంగా పిల్లల రక్షణకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దక్షిణాది ప్రాంతీయ సదస్సు నిర్వహించడం సంతోషకరమని సీఎం తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల సైబర్ భద్రతను ప్రధాన అంశంగా తీసుకుని నివారణ చర్యలపై చర్చించేందుకు సదస్సు నిర్వహించినందుకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.

### న్యాయ ప్రముఖులు హాజరు

సదస్సులో కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ విక్రమ్‌నాథ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య సంరక్షకుడు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, త్రిపుర హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ శ్యామ్ కోషి, పలు హైకోర్టుల న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, మాజీ న్యాయమూర్తులు సదస్సుకు హాజరయ్యారు.

# దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత

భారత సినీ యవనికపై తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు (94) శనివారం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆరు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి, భారతీయ సినిమా గతిని మార్చిన విలక్షణ సృష్టికర్తగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు. సింగీతం శ్రీనివాసరావు ప్రస్థానం 'మాయాబజార్' వంటి క్లాసిక్ చిత్రానికి కె.వి. రెడ్డి వద్ద సహాయకుడిగా ప్రారంభమైంది. ఆ తర్వాత దర్శకుడిగా మారి, భారత చలనచిత్ర చరిత్రలో మర్చిపోలేని చిత్రాలను అందించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రాలలో ప్రయోగాలు ఒక ముఖ్యమైన భాగంగా ఉండేవి. సంభాషణలు లేని బ్లాక్ కామెడీ 'పుష్పక విమానం' (1987), భారతీయ సినిమాలో తొలి టైమ్-ట్రావెల్ సైన్స్ ఫిక్షన్ చిత్రంగా ఖ్యాతి పొందిన 'ఆదిత్య 369' (1991), సుధా చంద్రన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన స్ఫూర్తిదాయక నృత్య కావ్యం 'మయూరి' (1985) వంటివి ఆయన సృజనాత్మకతకు తార్కాణాలు. కమల్ హాసన్‌తో ఆయన తీసిన 'అపూర్వ సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' చిత్రాలు కూడా కమర్షియల్‌గా భారీ విజయాలు సాధించాయి. సాంకేతికత అందుబాటులో లేని రోజుల్లోనే, గ్రాఫిక్స్, సీజీఐ హంగులు లేకుండానే తన కథనంతో ప్రేక్షకులను అబ్బురపరిచిన దర్శక మేధావి సింగీతం. ఆయన ప్రతిభకు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, నంది అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు ఎన్నోసార్లు వరించాయి. అద్భుతమైన విషయం ఏమిటంటే, 94 ఏళ్ల వయసులో కూడా ఆయన మళ్లీ దర్శకత్వం చేపట్టారు. వైజయంతీ మూవీస్ సమర్పణలో నాగ్ అశ్విన్ నిర్మించిన 'సింగ్ గీతం' అనే మ్యూజికల్ ఫాంటసీ చిత్రానికి ఈ ఏడాది దర్శకత్వం వహించారు. కేవలం 77 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది.



సింగీతం మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ నివాళులర్పిస్తూ, "ఆయన ఒక దార్శనికుడు. ఆదిత్య 369, పుష్పక విమానం, మయూరి వంటి ఆయన చిత్రాలు తరాలు మారినా తాజాగా అనిపిస్తాయి" అని పేర్కొన్నారు. బ్లాక్ అండ్ వైట్ 'మాయాబజార్' కాలం నుంచి 2026లో థియేటర్లలో విడుదలైన 'సింగ్ గీతం' వరకు ఆయన సినీ ప్రయాణం అసామాన్యమైనది, అజరామరమైనది.

# ఏపీకి 23 ఐఐటీల టెక్నాలజీ.. చంద్రబాబు సమక్షంలో డిక్లరేషన్!

సంపూర్ణ అంగీకారం తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో 'పాన్ ఐఐటీ ఏపీ 2026' సదస్సులో ఒక చారిత్రక డిక్లరేషన్‌ను విడుదల చేశాయి. అమరావతిని గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్ హబ్‌గా మార్చే లక్ష్యంతో విజయవాడలో జరిగిన ఈ సదస్సులో తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకు మైలురాయిగా నిలవనుంది. శనివారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన ఈ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటనలు చేశారు. అమరావతిలో 'పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్' ఏర్పాటు చేస్తున్నట్లు, డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా రూ.500 కోట్లతో 'పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100 మంది ఐఐటీయన్లతో ఒక గ్లోబల్ మెంటర్ల నెట్‌వర్క్‌ను కూడా ఏర్పాటు చేసి ఏపీలోని స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా క్యూ-శివ పేరుతో రూపొందించిన ఐదు మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్లను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్, చండీగఢ్ యూనివర్సిటీ సహకారంతో రూపొందించిన ఈ కంప్యూటర్లతో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్‌ను కూడా ఆవిష్కరించారు. 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌ను సృష్టించేలా క్వాంటం కంప్యూటర్ల తయారీకి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలో డీప్‌టెక్ ఉత్పత్తుల తయారీ సామర్థ్యానికి నిదర్శనమని సీఎం అన్నారు. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కాంపోనెంట్లు మచిలీపట్నంలోనే లభిస్తున్నాయని క్యూబిట్ సంస్థ సీఈఓ వివరించడం గమనార్హం. దేశ నిర్మాణంలో ఐఐటీయన్ల పాత్ర కీలకమని, వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు వారి మేధస్సును వినియోగించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "ఇప్పటివరకు సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడుకున్నాం. ఇకపై ప్రపంచం అమరావతి క్వాంటం వ్యాలీ గురించి మాట్లాడుకుంటుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతిలో ఐబీఎం-టీసీఎస్-ఎల్అండ్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను, వాటి పరికరాలను ఇక్కడే తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఏపీ ఎదగాలని ఆకాంక్షించారు.

### పాన్ ఐఐటీ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు

రెండు రోజుల మేధోమథనం అనంతరం విడుదల చేసిన ఉమ్మడి డిక్లరేషన్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్: అమరావతి కేంద్రంగా ఇది ఏర్పాటవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 5 లక్షల మంది ఐఐటీయన్లను అనుసంధానిస్తూ ఏపీ అభివృద్ధికి ఈ నెట్‌వర్క్ పనిచేస్తుంది. టెక్నాలజీ బదిలీ: 23 ఐఐటీలు, 25 ఇన్నోవేషన్ హబ్‌ల నుంచి టెక్నాలజీలను గుర్తించి ఏపీలోని పరిశ్రమలు, స్టార్టప్‌లకు అందుబాటులోకి తెస్తారు. నైపుణ్యాభివృద్ధి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను పాన్ ఐఐటీ ఎకోసిస్టంతో అనుసంధానించి పరిశోధన, నైపుణ్యాలను బలోపేతం చేస్తారు. స్టార్టప్‌లకు ప్రోత్సాహం: 2030 నాటికి రాష్ట్రంలో కనీసం 50 డీప్‌టెక్ స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయడమే లక్ష్యంగా 100 మంది ఐఐటీ మెంటర్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తారు. పెట్టుబడుల ఆకర్షణ: క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక డీప్‌టెక్ పాలసీ ప్యాకేజీని అమలు చేస్తారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో వివిధ ఐఐటీల డైరెక్టర్లు, సీఈఓలు, వెంచర్ క్యాపిటలిస్టులు పాల్గొన్నారు. ఇంధనం, ఆరోగ్యం, వ్యవసాయం, నీటి భద్రత వంటి పలు కీలక రంగాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. ప్రతి ఏడాది పాన్ ఐఐటీ సమ్మిట్ నిర్వహించాలని సీఎం ఈ సందర్భంగా ప్రతిపాదించారు.

# ఆటో కార్మికులకు త్వరలో సంక్షేమ బోర్డు

**న్యాయమైన సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరిస్తాం: భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్**

**ఆటో ఛార్జీ కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14కు పెంపు..**

**ప్రజాభవన్‌లో ఆటో సంఘాల నేతలతో సమావేశం**



హైదరాబాద్: ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో హైదరాబాద్ నగర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆత్మీయ విందు ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆటో సంఘాల ప్రతినిధులతో భోజనం చేశారు. అనంతరం వారి సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఆటో ఛార్జీల పెంపుపై డ్రైవర్లు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలించి, కేబినెట్‌లో చర్చించిన అనంతరం కిలోమీటర్‌కు రూ.11గా ఉన్న ఛార్జీని రూ.14కు పెంచుతూ జీవో జారీ చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ సమగ్రంగా అధ్యయనం చేసి కేబినెట్ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. 2014లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఆటో ఛార్జీని కిలోమీటర్‌కు రూ.11గా నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు.

### 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం

రవాణా రంగంలో దాదాపు 20 లక్షల కార్మిక కుటుంబాలు ఉన్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని చెప్పారు. చట్టసభల్లో చర్చించి, అవసరమైన నిధులు కేటాయించే ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం త్వరలోనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆటో డ్రైవర్లు ప్రస్తావించిన ఇతర సమస్యలను కూడా పరిశీలించి న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వం పనిచేస్తోందని, రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు కొనసాగిస్తామని మంత్రులు తెలిపారు.

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

**తెలంగాణ రక్షణ సేనకు తొలి ఎన్నిక.. ఉనికి చాటుకునే దిశగా అడుగులు**

**కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం**



హైదరాబాద్, అక్టోబరు 3 : ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారుతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో ఈ ఉపఎన్నిక ఆ పార్టీకి కీలక పరీక్షగా మారనుంది. ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మార్పు, తదనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఖైరతాబాద్ ఉపఎన్నికకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేయడం ద్వారా నియోజకవర్గంలో తమకు ఉన్న రాజకీయ మద్దతును అంచనా వేసుకునే అవకాశం లభించనుంది. కవిత నేతృత్వంలోని పార్టీకి ఈ ఎన్నికలో ప్రధాన లక్ష్యం గెలుపు మాత్రమే కాకుండా తమకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకును ఏర్పరచుకోవడమే కావచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలో పార్టీకి లభించే స్పందన, సాధించే ఓట్ల శాతం భవిష్యత్తు రాజకీయ ప్రస్థానానికి ఒక సూచికగా నిలవవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బస్తీలు, మధ్యతరగతి కాలనీలు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, విద్యావంతులు వంటి భిన్న వర్గాల ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థి ఎంపిక, స్థానిక సమస్యలపై ప్రచారం, పార్టీకి ఉన్న క్షేత్రస్థాయి బలం కీలకంగా మారే అవకాశం ఉంది. తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ, మహిళా సాధికారత వంటి అంశాలపై కవిత గతంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆమెకు మహిళల్లో గుర్తింపు తెచ్చాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఖైరతాబాద్‌లో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ధరల పెరుగుదల, మహిళా భద్రత, ప్రజా రవాణా, స్థానిక సమస్యలను ప్రచార అంశాలుగా తీసుకునే అవకాశం ఉంది. దానం నాగేందర్ పార్టీ మార్పు అంశాన్ని కవిత రాజకీయంగా ప్రధాన ప్రచార అంశంగా తీసుకుంటున్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమనే వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో ప్రభుత్వ విధానాలు, ప్రధాన పార్టీల రాజకీయ వైఖరులపై విమర్శలు చేస్తూ తమ పార్టీకి ప్రత్యేక రాజకీయ స్థానం ఏర్పరచుకునే వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. ఖైరతాబాద్ ఉపఎన్నికలో తెలంగాణ రక్షణ సేనకు లభించే ఓట్లు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీల సమీకరణాలపై ఎంతవరకు ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఆ పార్టీ వాస్తవ బలం, అభ్యర్థి ఎంపిక, ప్రచారానికి లభించే స్పందనపై ప్రభావం ఆధారపడి ఉంటుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఉపఎన్నికలో గెలుపు--ఓటములతో పాటు తెలంగాణ రక్షణ సేన సాధించే ఓట్ల శాతం కూడా కీలకంగా మారనుంది. ఈ ఫలితమే భవిష్యత్తులో పార్టీ విస్తరణకు ఎంత మేర అవకాశం ఉందో అంచనా వేసేందుకు రాజకీయ వర్గాలకు ఒక ఆధారంగా మారే అవకాశం ఉంది.

# రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది: హరీశ్

ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

# తెలంగాణలో సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాసులు!

తెలంగాణలోని సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వయోవృద్ధులకు కూడా వర్తింపజేసే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలతో పాటు పురుషులతో సహా వయోవృద్ధులందరికీ ప్రయోజనం చేకూర్చేలా ఈ పథకాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే వృద్ధులు ఆసుపత్రులు, పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు సులువుగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. అయితే, ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, వయో పరిమితి, ఆదాయ పరిమితులు వంటి అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో చర్చించి మార్గదర్శకాలను ఖరారు చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో వృద్ధుల జనాభా గణనీయంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 32.69 లక్షలుగా ఉన్న వీరి సంఖ్య, ఇప్పుడు సుమారు 48 లక్షలకు (12.5 శాతం) చేరినట్లు అంచనా. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వృద్ధుల సంక్షేమానికి చేయూత పెన్షన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే, మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే టీజీఎస్ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో, సీనియర్ సిటిజన్ల ఉచిత ప్రయాణంతో పడే అదనపు భారం, దానిని భర్తీ చేసే మార్గాలపై ప్రభుత్వం సమీక్ష జరుపుతోంది. అన్ని అంశాలను పరిశీలించి, విధివిధానాలు ఖరారు చేసిన తర్వాతే ఈ పథకం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

# చివరి నిమిషంలో కీలక నిర్ణయం!



కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# ఇజ్జత్‌నగర్‌లో అంగన్ మిలన్ సేవా కార్యక్రమం




శేరిలింగంపల్లి, అక్టోబర్ 3 (వాయిస్ టుడే): బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇజ్జత్‌నగర్‌లో 'అంగన్ మిలన్ సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ యాదవ్ నాయకత్వంలో జరిగిన కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలను శాలువాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో నాయకులు ముచ్చటించి, వారి శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడే వివిధ రకాల ఆట వస్తువులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ఆధారపడి ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పోషణ్ అభియాన్, మిషన్ సక్షమ్ అంగన్‌వాడీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించడం, పోషకాహార లోపాన్ని నివారించడం, గర్భిణులు, బాలింతలకు ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా ఆర్థిక సహాయం అందించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ, క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య పరిరక్షణకు అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిధులు కేటాయిస్తోందన్నారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా బీజేపీ కార్యకర్తలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తారని తెలిపారు.

కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పద్మ, జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులు సాగర్, డివిజన్ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, ఆనంద్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, జితేందర్, శ్రీనివాస్ రెడ్డి, భారతి లక్ష్మి, యాదమ్మ, పవన్ రెడ్డి, ఆశిక్ కుమార్, కురుమయ్య, గురు యాదవ్, బాలకుమార్, మోహన్ నాయక్, చంటి నాయక్, శివ యాదవ్, లోకేష్, మంజు, పట్టాభిరామ్, రోజా రమణి, అమని, మల్లేష్, రాము యాదవ్, నిఖిల్‌తో పాటు బీజేపీ మహిళా మోర్చా నాయకులు, స్థానిక డివిజన్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడ్చల్ ఆర్టీసీ డిపోలో కాంగ్రెస్ జోరుగా ప్రచారం

**ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో టిడబ్ల్యుయు**
**అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ నాయకుల ప్రచారం**

**కార్మికుల సంక్షేమమే లక్ష్యం..**
**సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం**



నాగారం, అక్టోబర్ 3:-(వాయిస్ టుడే): ఆర్టీసీ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రచారం మేడ్చల్ ఆర్టీసీ డిపోలో జోరుగా సాగింది. అక్టోబర్ 9న జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో డిపో గౌరవ అధ్యక్షులు సాటే నరేందర్ వంజరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు డిపోలో శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులను కలిసి ఎన్నికలపై నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టీయుసి/ఎస్డబ్ల్యుయు, టిఎంయు, ఎస్ డబ్ల్యుఎఫ్ లకు మద్దతు ప్రకటించిన టిడబ్ల్యూయు అభ్యర్థులకు కార్మికులు మద్దతు ఇవ్వాలని, బాణం గుర్తుపై తమ ఓటు వేయాలని నాయకులు కోరారు. కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, కార్మికుల హక్కులు మరియు సంక్షేమం కోసం తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, మేడ్చల్ ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షులు సాటే నరేందర్ వంజరిలు పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ అమీర్ ఆలీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, మేడ్చల్ ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షులు సాటే నరేందర్ వంజరి, మేడ్చల్ మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ కురుమ, జాకట దేవరాజ్, కౌడే మహేష్ కురుమ, పాలకుర్తి రాఘవేందర్ గౌడ్, నారెడ్డి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నడికొప్పు రంజిత్ ముదిరాజ్, వేముల శ్రీనివాస్ రెడ్డి, గువ్వ రవి ముదిరాజ్, ఉదండపురం సత్యనారాయణ, సల్ల వెంకటేష్ యాదవ్, రామన్నగారి సంతోష్ గౌడ్, లవంగు రాకేష్ వంజరి, ఆర్టీసీ యూనియన్ నాయకులు శేఖర్, శివ, జ్ఞానేశ్వర్, మధు, ఆనంద్, రాజు, రాజేష్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు,ఆర్టీసీ యూనియన్ ప్రతినిధులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్‌లో తెలంగాణ రక్షణ సేవ పార్టీ మీడియా సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 3:(వాయిస్ టుడే )తెలంగాణ రక్షణ సేవ పార్టీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పార్టీని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా మహమ్మద్ అలిమా బేగం వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో పార్టీ స్టేట్ ఇంచార్జ్ మనోజ్, లీగల్ అడ్వైజర్, జనరల్ సెక్రటరీ భారతి, నరేందర్, సీనియర్ లీడర్ గీతా గౌడ్, లత, శంకర్ నాయక్, సబితా, దీనా, మౌమిక, మళ్తుంకార్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, ప్రజా సమస్యలపై పనిచేయడం, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంపై నాయకులు వివరించారు.



## ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 3(వాయిస్ టుడే): సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి భౌరంపేట్ లక్ష్మీ నగర్ కాలనీలో విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా నాలుగు నాలుగు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయగా, మాజీ కౌన్సిలర్ మురళీ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాన్స్ఫార్మర్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ విచ్చేసి ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ద్వారా అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని, గత 12 ఏళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పాటు దుండిగల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ప్రసూన, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, కాలనీ వాసులు తిరుపతి రెడ్డి, దిలీప్, సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, చారి పాల్గొన్నారు.

# తీవ్రమైన నెలసరి నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు

**ఎండోమెట్రియాసిస్‌కు జన్యుపరమైన సంబంధాలపై కొత్త పరిశోధనలు**

**సీనియర్ ప్రసూతి, స్త్రీ రోగ వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి దండమూడి**



నాగారం, అక్టోబర్ 3:-(వాయిస్ టుడే) నెలసరి సమయంలో వచ్చే నొప్పిని సాధారణంగా భావించి నిర్లక్ష్యం చేయడం సరికాదని సీనియర్ ప్రసూతి, స్త్రీరోగ నిపుణురాలు డాక్టర్ దీప్తి దండమూడి తెలిపారు. నెలసరి నొప్పి తీవ్రంగా ఉండటం, తరచూ ఇబ్బంది పెట్టడం కొన్నిసార్లు ఎండోమెట్రియాసిస్ వంటి సమస్యకు సంకేతంగా ఉండవచ్చని ఆమె పేర్కొన్నారు. భారతీయ జన్యు సమాచారంపై ఇటీవల జరిగిన పరిశోధనల్లో ఎండోమెట్రియాసిస్‌తో సంబంధం ఉన్న కొన్ని జన్యు ప్రాంతాలను గుర్తించినట్లు వెల్లడైంది. ఈ పరిశోధనలు కొంతమంది మహిళల్లో ఈ సమస్య వచ్చే అవకాశాలకు జన్యుపరమైన అంశాలు కూడా కారణమవుతాయనే విషయంపై మరింత అవగాహన కల్పిస్తున్నాయి.

"నెలసరి నొప్పి కారణంగా రోజువారీ పనులు, ఉద్యోగం, చదువు లేదా నిద్రకు ఇబ్బంది కలుగుతున్నప్పుడు దాన్ని సాధారణంగా తీసుకోకూడదు. నొప్పి తీవ్రంగా లేదా క్రమంగా పెరుగుతున్నట్లయితే గైనకాలజిస్ట్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి," అని డాక్టర్ దీప్తి దండమూడి, సీనియర్ అబ్స్టెట్రిషియన్ అండ్ గైనకాలజిస్ట్, ల్యాపరోస్కోపిక్ సర్జన్, కాస్మెటిక్ గైనకాలజిస్ట్ తెలిపారు. ఎండోమెట్రియాసిస్‌లో గర్భాశయ పొరను పోలిన కణజాలం గర్భాశయం వెలుపల పెరగడం వల్ల తీవ్రమైన నెలసరి నొప్పి, కటి ప్రాంతంలో నొప్పి, అధిక రక్తస్రావం, లైంగిక సంబంధాల సమయంలో నొప్పి వంటి సమస్యలు రావచ్చు. కొంతమంది మహిళల్లో సంతానలేమికి కూడా ఇది కారణమయ్యే అవకాశం ఉంది.

నెలసరి నొప్పి క్రమంగా పెరగడం, సాధారణ నొప్పి నివారణ మందులతో ఉపశమనం కలగకపోవడం, అధిక రక్తస్రావం, తరచూ కడుపు లేదా కటి ప్రాంతంలో నొప్పి, లైంగిక సంబంధాల సమయంలో నొప్పి లేదా గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఉంటే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ దీప్తి సూచించారు.

"ఎండోమెట్రియాసిస్‌కు సంబంధించిన జన్యుపరమైన అంశాలపై జరుగుతున్న పరిశోధనలు వ్యాధిని మరింతగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. అయితే జన్యుపరమైన సంబంధం ఉన్నంత మాత్రాన ప్రతి మహిళకు ఈ సమస్య వస్తుందని అర్థం కాదు. లక్షణాలు, వైద్య పరీక్షల ఆధారంగానే నిర్ధారణ, చికిత్స నిర్ణయించాలి," అని ఆమె వివరించారు. ఎండోమెట్రియాసిస్ లక్షణాలు ఇతర స్త్రీరోగ సమస్యలతో పోలి ఉండే అవకాశం ఉండటంతో కొన్నిసార్లు వ్యాధిని గుర్తించడంలో ఆలస్యం జరుగుతుంది. అవసరాన్ని బట్టి వైద్యులు స్కానింగ్ వంటి పరీక్షలు, మరికొన్ని సందర్భాల్లో ల్యాపరోస్కోపిక్ పరీక్షను సూచించవచ్చు.

"ప్రతి నెలా భరించలేని నొప్పితో బాధపడటం సాధారణం కాదు. నొప్పిని నిర్లక్ష్యం చేయకుండా సరైన సమయంలో వైద్య సలహా తీసుకోవడం మహిళల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం," అని డాక్టర్ దీప్తి తెలిపారు.



## స్మిత్ మచ్చర్ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని పూజా అర్చన

కవాడిగూడ : దుబాయ్ నుండి ఇజ్రాయెల్ టెల్ అవీస్ వెళ్తున్న విమానంలో కో-పైలట్ దాడి జరిపి విమానం కూల్చివేతకు పన్నిన కుట్రను ఎంతో సమయస్ఫూర్తితో ఎదుర్కొని 170 కి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడడానికి, తన పై భౌతిక దాడి జరుగుతున్నా తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఎంతో నిబ్బరంగా హనుమాన్ చాలీసాను పఠిస్తూ కాక్ పిట్ తలుపు తెరిచి మిగతా ప్రయాణీకుల స్పందనతో ఘోర ప్రమాదాన్ని తప్పించారు. ఆయన తెగువ, ధైర్యం దేశానికి గర్వకారణం ప్రపంచ దేశాలు ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టే భారతీయులు అని శ్లాఘిస్తాయి. కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని కవాడిగూడ సంకట విచోచన హనుమాన్ దేవాలయంలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ పేరు పై అర్చన, పూజలు చేయించారు.



## హఫీజ్‌పేట్‌లో వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు పనులను పరిశీలించిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

హఫీజ్‌పేట్, అక్టోబర్ 3 (వాయిస్ టుడే ): హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలినగర్ కాలనీలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మంజీరా పైప్‌లైన్ రోడ్ నుంచి మసీద్‌బండ వైపు వెళ్లే రైల్వే అండర్‌పాస్ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయని, వారం రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అండర్‌పాస్ వద్ద ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, రాకపోకలకు అంతరాయం కలగకుండా వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు పనులను రూ.70 లక్షలతో చేపట్టినట్లు గాంధీ తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. వరద నీటి కాల్వ నిర్మాణంలో తీసుకోవాల్సిన సాంకేతిక అంశాలపై ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. హఫీజ్‌పేట్ డివిజన్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తామని గాంధీ తెలిపారు. కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించి, సురక్షితమైన, సులభమైన రాకపోకలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని మెరుగైన పౌర మౌలిక వసతులతో ఆదర్శ ప్రాంతాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకుడు సత్యం, స్థానికులు పాల్గొన్నారు.



## కీసర డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నాగారం, అక్టోబర్ 3:-(వాయిస్ టుడే): కీసర డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్ కాలనీ లో 490 మీటర్లు రూ: 36 లక్షల నిధులతో సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్ పార్టీ కీసర డివిజన్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులతో కలసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని కాంట్రాక్టర్‌కు సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం కొంతకాలం పాటు ప్రజలు రోడ్డును జాగ్రత్తగా వినియోగించాలని తెలిపారు. సీసీ రోడ్లు పూర్తిగా గట్టిపడే వరకు దానిపై నడవకుండా జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ఎక్కువకాలం మన్నికగా ఉంటుందని తెలిపారు. రోడ్డు మనది అనే విషయం మరువద్దన్నారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిర్మాణ సామగ్రి నాణ్యత, పనుల ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యమైన రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మొరుగు ముత్యాలు, కొల కృష్ణ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేణు, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి కృష్ణారెడ్డి, కీసర డివిజన్ జనరల్ సెక్రటరీ తటకం లక్ష్మణ్ శర్మ, వైస్ ప్రెసిడెంట్ కందాడి సత్తిరెడ్డి, మంకీ రాజు, బిఎల్ఏలు, సెక్రటరీ చెర్రపల్లి కృష్ణారెడ్డి, చినిగిరి నరసింహ, సంఘరి లత, ట్రెజరీ బెలిత రాజగుప్త, మాజీ ఎంపిపి రామారం సుజాత మరియు సీనియర్ నాయకులు చిక్కుడు రమేష్ ముదిరాజ్, జూపల్లి సాయిలు, వెంకట్ చారి, ముద్దం మల్లేష్ యాదవ్, పోచమైన రాజు యాదవ్, మచ్చని శ్రీశైలం యాదవ్, మరియు శ్రీనివాస నగర్ కాలనీ అధ్యక్షుడు పుంద్రు రాకేష్, ప్రధాన కార్యదర్శి చినిగాని మల్లేష్, మోర్గు నరసింహ, ఆదినారాయణ, శీలం లలిత, మాజీ వార్డ్ మెంబెర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావేత్తలకు ఘన సత్కారం

## హైదరాబాద్‌లో వైభవంగా అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్



హైదరాబాద్ (వాయిస్ టుడే): అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. భారతీయ విద్యా రంగానికి విశేష సేవలు అందించిన ముగ్గురు ప్రముఖ విద్యావేత్తలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు.కార్యక్రమానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సహ సర్కార్యవాహ్ సి.ఆర్. ముకుంద్ జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ నారాయణ్ లాల్ గుప్తా జీ సభాధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి హాజరై మంగళాశాసనం అందించారు.ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్కు విద్యా, సాహిత్య రంగాల్లో చేసిన విశేష సేవలకు గాను సత్కారం అందించారు. మాజీ యూజీసీ చైర్మన్‌గా, ప్రస్తుతం ఐఐఎం కలకత్తా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా ఆయన సేవలందిస్తున్నారు. జాతీయ విద్యా విధానం--2020 అమలు, ఉన్నత విద్యలో సంస్కరణలు, ప్రాంతీయ భాషల్లో ఉన్నత విద్య, ఆన్‌లైన్ విద్యా విస్తరణ తదితర అంశాల్లో ఆయన చేసిన కృషిని నిర్వాహకులు కొనియాడారు.ప్రొఫెసర్ బి. మహదేవన్ను కూడా ఘనంగా సన్మానించారు. ఐఐఎం బెంగళూరులో ప్రొఫెసర్, డీన్‌గా సుదీర్ఘకాలం సేవలందించిన ఆయన భారతీయ జ్ఞాన వ్యవస్థ, వేదాలు, భగవద్గీత, నిర్వహణ విద్య తదితర అంశాలపై విశేష కృషి చేశారు. 'ఇంట్రడక్షన్ టు ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్', 'ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్' వంటి గ్రంథాలను రచించారు. చిన్మయ విశ్వవిద్యాపీఠం వ్యవస్థాపక ఉపకులపతిగా కూడా సేవలందించారు.డి.రామకృష్ణారావు, మాజీ ప్రిన్సిపాల్, విజ్ఞాన విహార్ విద్యా సంస్థలు, విశాఖపట్నం, విద్యా రంగంలో చేసిన సుదీర్ఘ సేవలకు గాను సత్కారం అందుకున్నారు. 2019 నుంచి 2025 వరకు విద్యాభారతి జాతీయ అధ్యక్షులుగా, ప్రస్తుతం జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. జాతీయ విద్యా విధానం--2020 అమలు, ఉపాధ్యాయ శిక్షణ, నైతిక విద్య, యోగా, పాఠశాల విద్యా సంస్కరణలపై ఆయన విశేష కృషి చేశారు. విద్యా రంగానికి సంబంధించిన పలు పరిశోధనా పత్రాలను కూడా ప్రచురించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భారతీయ విద్యా చింతన, గురు పరంపర, విలువల ఆధారిత విద్యను ప్రోత్సహించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సమావేశానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షులు నారాయణ్ లాల్ గుప్తా, జాతీయ కార్యదర్శి ఆచార్య గీతా భట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్ర కపూర్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు కిషన్ జీ, ఏలూరి యాదయ్య, డా. కె. భాస్కర్, జగన్, దయానంద్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.




## విశిష్ట సేవా పతక గ్రహీత షేక్ అబ్దుల్ సమద్‌కి జీవీఆర్ కరాటే అకాడమీ ఘన సన్మానం

హైదరాబాద్, అక్టోబర్ 03: ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం) అందుకున్న శ్రీ షేక్ అబ్దుల్ సమద్‌ను జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. షేక్ అబ్దుల్ సమద్ సిఆర్‌పిఎఫ్ మరియు నేషనల్ పోలీస్ అకాడమీలో దాదాపు 41 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించారు. 1985లో కానిస్టేబుల్‌గా తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, క్రమశిక్షణ, అంకితభావం మరియు కృషితో ఇన్‌స్పెక్టర్, డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ స్థాయికి ఎదిగారు. తన సేవా కాలంలో ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారులు, నేరుగా నియామకమైన సబ్-ఇన్‌స్పెక్టర్లు మరియు అనేక మంది పోలీసు సిబ్బందికి ఆదర్శవంతమైన శిక్షణ అందించారు.

పంజాబ్, అస్సాం, జమ్మూ-కాశ్మీర్ మరియు త్రిపుర వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా ఆయన సేవలు అందించారు. శారీరక శిక్షణ, డ్రిల్, మార్షల్ ఆర్ట్స్, నిరాయుధ పోరాటం (అన్-ఆర్మ్డ్ కాంబాట్), స్వయంరక్షణ, ఆయుధ శిక్షణ, ఉగ్రవాద నిరోధక శిక్షణ వంటి అనేక కీలక విభాగాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది. తన విశిష్ట సేవలకు గాను 2010లో రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకం (మెరిటోరియస్ సర్వీస్ మెడల్) అందుకున్న ఆయన, అనంతరం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (ఉత్తమ సేవా పతకం)ను కూడా సాధించారు. తన సుదీర్ఘ సేవా కాలమంతా ఎలాంటి క్రమశిక్షణా చర్యలు లేదా శిక్షలు లేకుండా అత్యంత ఆదర్శప్రాయమైన సేవా రికార్డును కొనసాగించడం ఆయన ప్రత్యేకత. జీవీఆర్ కరాటే అకాడమీతో శ్రీ అబ్దుల్ సమద్‌కి ప్రత్యేక అనుబంధం ఉంది. 2016లో ఈ అకాడమీ ద్వారానే ఆయన కరాటే బ్లాక్ బెల్ట్ సాధించారు. ఇప్పటికీ అదే ఆసక్తి, క్రమశిక్షణతో కరాటే సాధనను కొనసాగిస్తూ, ఈ సంవత్సరం తన తదుపరి 'డాన్' గ్రేడింగ్‌కు సిద్ధమవుతున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి శ్రీ మహమ్మద్ అలీ రఫత్, సీనియర్ న్యాయవాది శ్రీ అశోక్ మరియు జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపక సంచాలకులు డాక్టర్ జి. ఎస్. గోపాల్ రెడ్డి పాల్గొని శ్రీ షేక్ అబ్దుల్ సమద్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ అబ్దుల్ సమద్ సుదీర్ఘ సేవలు, పోలీసు శిక్షణ రంగానికి ఆయన చేసిన కృషి, క్రమశిక్షణ మరియు మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రముఖులు కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయన తన అనుభవం, జ్ఞానంతో యువతకు మార్గదర్శకంగా నిలవాలని జీవీఆర్ కరాటే అకాడమీ ప్రతినిధులు ఆకాంక్షించారు.

## సృజనాత్మక ఆలోచనలతో సమస్యలను పరిష్కరించాలి

**ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో 'బిజ్‌పర్బ్ 2కె26' మేనేజ్‌మెంట్ మీట్**

**హాజరైన వివిధ కళాశాలల విద్యార్థులు**



హైదరాబాద్, అక్టోబర్ 03: మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంస్థ సంచాలకులు (డైరెక్టర్) మరియు ముఖ్య పరిపాలనాధికారి డాక్టర్ ఈ. విజయ పిలుపునిచ్చారు. నారాయణగూడలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాల వ్యాపార నిర్వహణ (బిజినెస్ మేనేజ్‌మెంట్) విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన 'బిజ్‌పర్బ్ 2కె26' మేనేజ్‌మెంట్ మీట్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

జంట నగరాల పరిధిలోని 20 ప్రధాన విద్యాసంస్థల నుంచి 500 మందికి పైగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. "సవాలు చేయి, పోటీపడు, విజయం సాధించు" అనే సమకాలీన ఇతివృత్తంతో (థీమ్) ఈ పోటీలను నిర్వహించారు. భవిష్యత్ వ్యాపార నాయకులలో వ్యూహాత్మక ఆలోచనా సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలు మరియు శీఘ్ర నిర్ణయాత్మక శక్తిని పెంపొందించడానికి ఈ వేదిక దోహదపడింది. ఆర్థిక రంగానికి సంబంధించిన ఆర్థిక నిర్వహణ (ఫైనాన్స్), విక్రయ రంగానికి సంబంధించిన మార్కెటింగ్, మానవ వనరుల విభాగం తదితర అంశాల్లో నిర్వహించిన వివిధ పోటీలు విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టాయి. ప్రధాన ఆకర్షణగా నిలిచిన 'ది యంగ్ మేనేజర్' పోటీ ద్వారా పాల్గొన్నవారి నాయకత్వ శైలిని, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పరీక్షించారు. అమృత మిశ్రా వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎమ్.వి.ఎస్. కార్యదర్శి ప్రొఫెసర్ కె. ముత్యం రెడ్డి, ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాల కార్యదర్శి మరియు తాళపత్ర ప్రతినిధి (కరస్పాండెంట్) ప్రొఫెసర్ జి. సుదర్శన్ రెడ్డి, కళాశాల ప్రాన్సిపాల్ ప్రొఫెసర్ జె. అచ్యుత దేవి, వ్యాపార నిర్వహణ విభాగాధిపతి డాక్టర్ ఆర్. బిందు, కార్యక్రమ సమన్వయకర్తలు (ఈవెంట్ కన్వీనర్లు) డాక్టర్ పి. జయశ్రీ, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుకి ఘన స్వాగతం

**సిపిఆర్ఐ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**బిజెవైఎం రాష్ట్ర నాయకుడు కన్నెబోయిన రాము యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

మేడిపల్లి, అక్టోబర్ 03: భాజపా కర్ణాటక సహ ఇన్‌ఛార్జ్ (సహ ప్రభారి)గా నియమితులైన అనంతరం తొలిసారిగా శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి విచ్చేస్తున్న డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుకి సిపిఆర్ఐ గణపతి దేవాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బిజేవైఎం రాష్ట్ర నాయకుడు కన్నెబోయిన రాము యాదవ్ ఆధ్వర్యంలో సిపిఆర్ఐ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బండారు పవన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గీతా రామ్, నవ్య రెడ్డి, శ్రీకాంత్, అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా ముఖ్య నాయకులు, మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ రెడ్డి, బిజేవైఎం జిల్లా అధ్యక్షుడు కుమార్ స్వామి, సోమ నరసయ్య, పన్నాల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి ప్రాంతానికి చెందిన బిజెపి శ్రేణులు, యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుకి పూలమాలలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్‌గా కీలక బాధ్యతలు స్వీకరించిన ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని నాయకులు ఆకాంక్షించారు. సాధారణ కార్యకర్త కూడా అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం కేవలం భారతీయ జనతా పార్టీలోనే సాధ్యమని, అందుకు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు నియామకమే నిదర్శనమని నేతలు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో, కార్యకర్తల ఉత్సాహాల నడుమ ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది.



## ధూల్‌పేట్‌లో ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి వేడుకలు

ధూల్‌పేట్, అక్టోబర్ 03: ధూల్‌పేట్ రహీంపురాలోని అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి ప్లేగ్రౌండ్‌లో భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజా సింగ్ లోధ్ ముఖ్య అతిథిగా హాజరై లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశం కోసం శాస్త్రిగారు చేసిన సేవలు, ఆయన నిరాడంబరత, 'జై జవాన్ - జై కిసాన్' నినాదం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం పేదలకు, స్థానికులకు పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గోపిశెట్టి ప్రమోద్, మంగళ్‌హాట్ డివిజన్ అధ్యక్షుడు పి. కిషోర్ కుమార్, మాజీ కార్పొరేటర్ శశికళా కృష్ణ జీ, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ జీలతో పాటు నాయకులు రఘునందన్ యాదవ్, రవీందర్ సింగ్, ముకేష్ సింగ్, నవీన్ చుకా, సురేష్ సింగ్, బబ్లూ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## తాళ్లపల్లి వేణుగోపాల్ ప్రథమ వర్ధంతి.

నాచారం (వాయిస్ టుడే): తాళ్లపల్లి వేణు గోపాల్ ప్రథమ వర్ధంతి గోపాలపురం కమిటీ హాల్లో శనివారం జరిగింది. బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అనంతోజు బ్రహ్మాచారి హాజరై బాల్య మిత్రుడైన తాళ్లపల్లి వేణు చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాల్యాన్ని గుర్తు తెచ్చుకొని భావోద్వానికి లోనయ్యారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో అనంతోజు విమల, స్పందన, తాళ్లపల్లి పద్మశ్రీ, కరణం రమణ, అనిత, రోహిత్, పూజ, దియాన్, దిలీప్ కుమార్,గుండ శుభం, కొమరయ్య, యాదగిరి, కొమురయ్య గౌడ్, తాళ్లపల్లి లక్ష్మి, సత్యనారాయణ, శ్రీనివాస్, మహేందర్, భారతమ్మ, అంజమ్మ తో పాటు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మల్లాపూర్‌లో ఘనంగా అంగన్ మిలన్ సేవా అభియాన్ కార్యక్రమం

నాచారం (వాయిస్ టుడే):ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మల్లాపూర్‌లో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బోధాసు మాధవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల కోసం అంగన్ మిలన్ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను సన్మానించి, పౌష్టికాహార పదార్థాలను పంపిణీ చేశారు. గర్భిణీ మహిళలను కూడా సత్కరించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధి, మహిళా సంక్షేమంలో అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది చేస్తున్న సేవలను నాయకులు అభినందించారు. మహిళా సాధికారతను పెంపొందించడంతో పాటు సమాజంలోని అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



## సీతాఫల్మండి డివిజన్ పరిధిలోని బీదల బస్తీ బిజెపి డివిజన్ అధ్యక్షుడు అరవింద్ ఆధ్వర్యంలో..



నాచారం (వాయిస్ టుడే):సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా అంగన్ మిలన్ కార్యక్రమం ద్వారా బీదల బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి పాల్గొని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. చిన్నారులతో సమయం గడపడం, వారికి ఆహార పదార్థాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకట్ల హరి, కందాడి నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్ గిరి, డివిజన్ అధ్యక్షుడు అరవింద్ చందుపట్ల, మూత గణేష్, ఆకుల సంపత్, కుమార స్వామి, నీలి శ్రీనివాస్, అయ్యప్ప రెడ్డి, చరణ్ రాజ్, యశ్వంత్ తో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అశోక్ సింగాల్ శత జయంతి వేడుకలు

**కర్మన్‌ఘాట్ ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహణ**

**ముఖ్య అతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, చంపత్ రాయ్**

**భారీగా తరలిరావాలని వీహెచ్‌పీ నేత బాలస్వామి పిలుపు**



భాగ్యనగరం, అక్టోబర్ 03: విశ్వహిందూ పరిషత్ అగ్రనేత, దివంగత అశోక్ సింగాల్ శత జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ తెలంగాణ ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తెలిపారు. వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 4 (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు కర్మన్‌ఘాట్ సమీపంలోని ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, వీహెచ్‌పీ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చంపత్ రాయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు బాలస్వామి వెల్లడించారు. హిందూ సమాజ సంఘటితం, ధార్మిక చైతన్యం, అయోధ్య శ్రీరామ జన్మభూమి ఉద్యమంలో అశోక్ సింగాల్ పోషించిన కీలక పాత్రను స్మరించుకుంటూ ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అశోక్ సింగాల్ శత జయంతి ఉత్సవాలు 2026 సెప్టెంబర్ 27 నుండి 2027 సెప్టెంబర్ 27 వరకు ఏడాది పాటు ప్రపంచవ్యాప్తంగా సాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి కరసేవకులు, స్వయంసేవకులు, ధర్మాచార్యులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు "ఇండియా" కూటమి పాదయాత్ర

### సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

### 5న అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర



హనుమకొండ, అక్టోబర్ 03 (వాయిస్ టుడే): కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై "ఇండియా" కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వ ప్రభావంలో పనిచేస్తోందని, ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణకు కూటమి శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు అక్టోబర్ 02 నుంచి 08 వరకు నిర్వహిస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా శనివారం హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన కూటమి పార్టీల సంయుక్త విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు తదితరులు మాట్లాడుతూ ఎన్నికల సంఘం పక్షపాత వైఖరి వీడి స్వతంత్రంగా వ్యవహరించాలని కోరారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5న హనుమకొండలోని డా.బి.ఆర్. అంబేద్కర్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు "ఇండియా" కూటమి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీ ముగింపులో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ను బహిరంగంగా చదివి వినిపిస్తామని చెప్పారు. యువజన, విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామికవాదులు, వివిధ అనుబంధ సంఘాలు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 6 నుంచి 8 వరకు జిల్లాలోని మండలాలు, పట్టణాలు, డివిజన్ల స్థాయిలో "ఇండియా" కూటమి భాగస్వామ్య పార్టీల సంయుక్త సమావేశాలు నిర్వహించి, క్షేత్రస్థాయి కార్యకర్తలను సమీకరించనున్నట్లు నాయకులు తెలిపారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటు హక్కు పరిరక్షణ వంటి అంశాలపై తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నున్నా అప్పారావు, టీజేఎస్ అధ్యక్షుడు చిల్లా రాజేంద్రప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, మార్క విజయ్‌కుమార్, దుద్దిల్ల శ్రీనుబాబు తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.



## సనత్‌నగర్ TIMSలో చోరీ.. బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

హైదరాబాద్: సనత్‌నగర్‌లోని ౧×మీా ఆస్పత్రిలో లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలు అపహరణకు గురైన ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రిని సందర్శించేందుకు సిద్ధమైన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. వాస్తవాలను తెలుసుకునేందుకు TIMS ఆస్పత్రిని సందర్శించనున్నారన్న సమాచారంతో బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ మాగంటి సునీత గోపీనాథ్ ముఖ్య అనుచరులు, సీనియర్ నాయకులు నవీన్ పటేల్, చంద్రశేఖర్, నాగరాజు, ఫాహీమ్, జహీర్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నవీన్ పటేల్ మాట్లాడుతూ.. TIMSలో జరిగిన చోరీపై వాస్తవాలను తెలుసుకునేందుకు వెళ్తున్న తమను ముందస్తుగా నిర్బంధించడం సరికాదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు తమను నిర్బంధించినప్పటికీ, ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలపై ప్రశ్నించడం కొనసాగిస్తామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని నవీన్ పటేల్ పేర్కొన్నారు. అయితే, నాయకుల ముందస్తు అరెస్టులకు సంబంధించి పోలీసులు వెల్లడించిన కారణాలు, TIMSలో వైద్య పరికరాల చోరీపై అధికారికంగా నమోదైన కేసు వివరాలు తెలియాల్సి ఉంది.

## వికారాబాద్ బస్సు ప్రమాదంపై ఎంపీ వద్దిరాజు దిగ్భ్రాంతి

### గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి



హైదరాబాద్: వికారాబాద్ జిల్లా అనంతగిరి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటం బాధాకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. వికారాబాద్ నుంచి తాండూరు వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు శనివారం ఉదయం అదుపుతప్పి లోయలో పడిపోయిన ఘటనలో ముగ్గురు మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీ వద్దిరాజు ప్రభుత్వాన్ని కోరారు. క్షతగాత్రులకు అవసరమైన వైద్యం అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.



## ఆరవ రోజుకు చేరుకున్న ఎన్ ఎచ్ ఎం ఉద్యోగుల నిరసన

### ఆరవ రోజు కుటుంబ సభ్యులతో కలిసి నిరసన...

దంతాలపల్లి అక్టోబర్03(వాయిస్ టుడే):-జాతీయ హెల్త్ మిషన్ వారి 14 రోజుల నిరసన శనివారం రోజున ఆరవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దంతాలపల్లి మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఎన్ ఎచ్ ఎం ఉద్యోగులు నిరసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లుటకు పి ఎచ్ సి లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఎన్ ఎచ్ ఎం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఐక్యంగా నిరసన కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ సమీక్ష

### ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నించేందుకు బలం ఇవ్వాలి

### మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి: ఏనుగుల రాకేష్‌రెడ్డి



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 03(వాయిస్ టుడే): వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ, SIR, సోషల్ మీడియా వారియర్స్‌పై వర్ధన్నపేట నియోజకవర్గంలోని మామునూరు హెచ్‌ఆర్ఎస్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రశ్నించే వ్యక్తులకు బలం ఇవ్వాలని కోరారు. అనంతరం గతంలో ఎమ్మెల్సీ గా పోటీచేసిన ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై బీఆర్ఎస్ పోరాడిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మద్దతుగా పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు అరూరి విశాల్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉద్యమకారుడు కేదారి కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ సాయం

### 10లక్షల రూపాయలను అందించిన ప్రజాప్రతినిధులు

### ఉద్యమకారులను గుర్తించి అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 03(వాయిస్ టుడే): ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లింగాల కేదారి, పుష్పలత దంపతుల కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.10 లక్షల ఆర్థిక సాయం చెక్కును శనివారం అందజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కేదారి కుటుంబ సభ్యులను పరామర్శించి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేదారి అందించిన సేవలను ప్రజా ప్రభుత్వం గుర్తించి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిందన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కేదారి కుటుంబానికి వ్యక్తిగతంగా కూడా తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి శ్రీనివాస్, బట్టి శ్రీనివాస్, హనుమకొండ తహశీల్దార్ రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## నేమ్‌బోర్డులో తెలుగు భాషను మధ్యలో ఉంచాలి

### తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని రైల్వే అధికారులకు వినతి

### త్వరలో మార్పు చేస్తామని స్టేషన్ మేనేజర్ హామీ

కాజీపేట, అక్టోబర్ 03(వాయిస్ టుడే): కాజీపేట రైల్వే స్టేషన్ భవనం మీద ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డులో తెలుగు భాషను మధ్యలో ఉంచాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శనివారం స్టేషన్ మేనేజర్ ఏ. రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కాజీపేటకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఎదురుగా కనిపించేలా తెలుగు పేరును మధ్యలో ఏర్పాటు చేయాలని వారు కోరారు. దీనిపై త్వరలోనే నేమ్‌బోర్డులో మార్పులు చేస్తామని స్టేషన్ మేనేజర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్, రైతుబంధు సమన్వయకర్త సుంచు కృష్ణ, మాజీ కార్పొరేటర్ సంకు నర్సింగ్, డివిజన్ అధ్యక్షులు దువ్వ కనకరాజ్, బెదరకోట రంజిత్, మహ్మద్ హుస్సేన్, పాలడుగుల రామస్వామి, కొండ్ర శంకర్, గబ్బెట కరుణ్ (సిద్దు), దువ్వ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ కమిటీలో మరోసారి ఎంపీ కడియం కావ్యకు చోటు

### క్యాన్సర్ స్క్రీనింగ్, ఆధునిక వైద్యం, గ్రామీణ ఆరోగ్య సేవలపై దృష్టి

### అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంట్‌కు ఎంపీ కావ్య కృతజ్ఞతలు



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 3 (వాయిస్ టుడే):లి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (2026--27) సభ్యురాలిగా మరోసారి నామినేట్ చేశారు. సెప్టెంబర్ 26 నుంచి నియామకం అమల్లోకి వచ్చినట్లు రాజ్యసభ సెక్రటేరియట్ వెల్లడించింది. ఈ మేరకు కమిటీ డైరెక్టర్ భూపేంద్ర భాస్కర్ అక్టోబర్ 3న ఆమెకు లేఖ పంపారు.

ప్రజారోగ్య రంగంలో పార్లమెంటరీ స్థాయిలో పనిచేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని కడియం కావ్య తెలిపారు. పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందు వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలపై 2026 మార్చి 27న లోక్‌సభలో ప్రస్తావించిన ఆమె, క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించేందుకు దేశవ్యాప్తంగా స్క్రీనింగ్‌ను విస్తరించాలని కోరారు. ాా× ఆధారిత స్క్రీనింగ్, ఆధునిక డయాగ్నస్టిక్ విధానాలను ప్రోత్సహించడంతో పాటు గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తేవాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. కమిటీలో అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ కావ్య క్యాన్సర్ స్క్రీనింగ్, వ్యాధుల నివారణ, ఆరోగ్య మౌలిక వసతులు, వైద్య సేవల అందుబాటు వంటి అంశాలపై జాతీయ స్థాయిలో కృషి చేస్తానని, వరంగల్ ప్రజల తరపున బలంగా గళం వినిపిస్తానని పేర్కొన్నారు.



## వివేకానంద అధ్యాపకునికి ప్రాణదాత అవార్డు

కరీంనగర్,అక్టోబర్ 03(వాయిస్ టుడే): జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ,పి.జి.కళాశాల కంప్యూటర్ విభాగధిపతి, అకాడమిక్ కోఆర్డినేటర్ బండి సంపత్ కుమార్ కు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసరా ప్రాణదాత 2026 అవార్డును ప్రధానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ తెలిపారు.సంపత్ కుమార్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాలలో విద్యార్థులను రక్తదానం పట్ల ప్రోత్సహిస్తూ తాను స్వయంగా 25 సార్లు రక్తదానం చేసినందుకుగాను జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ ద్వారా ఈ అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా ఆసరా ప్రాణదాత అవార్డు గ్రహీత బండి సంపత్ కుమార్ ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్,ఏవో బి. శ్రావణ్ కుమార్,కామర్స్ విభాగాధిపతి,ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్.గోపి కృష్ణ,అధ్యాపక బృందం అభినందించారు.

## కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

### కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్,అక్టోబర్ 03 (వాయిస్ టుడే): నగరపాలక సంస్థను తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.29వ డివిజన్ కిసాన్ నగర్, మింగని వాడ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు,స్థానిక కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తో కలిసియూఐడీఎఫ్ నిధులు రూ.70 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు,డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.28,29వ డివిజన్ల పరిధిలోని హనుమాన్ దేవాలయం సమీపంలో15వ ఆర్థిక సంఘం నిధులు రూ.56 లక్షలతో ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా కోసం చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన రోడ్లు,డ్రైనేజీలు,తాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్లను ఆదేశించారు.నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం,ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కరీంనగర్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మేయర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో పలువురు కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర,గాజ రమా శివరాం,ఎన్నం లక్ష్మీ ప్రకాష్,మున్సిపల్ అధికారులు,ఇంజనీరింగ్ సిబ్బంది,కాంట్రాక్టర్లు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## జిల్లా కాంగ్రెస్ ఓబిసి సెల్ పదవులకు దరఖాస్తులు స్వీకరించిన పీసీసీ పరిశీలకులు

కరీంనగర్,అక్టోబర్ 03(వాయిస్ టుడే): జిల్లా డీసీసీ పరిధిలోని ఓబీసీ సెల్ జిల్లా,అసెంబ్లీ,నగర, మండల,గ్రామ,డివిజన్ అధ్యక్ష పదవుల కోసం ఆశావాహుల నుండి కాంగ్రెస్ ఓబీసీ సెల్ పరిశీలకులు డిసిసి కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా పరిశీలకులు చెట్కూరి కమలాకర్ యాదవ్,బొడ్డు రాకేష్ కరీంనగర్,హుజురాబాద్, మానకొండూర్,చొప్పదండి, హుస్నాబాద్ నియోజకవర్గాల నుండి వచ్చిన కాంగ్రెస్ నేతల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్ష పదవికి,వివిధ నియోజకవర్గాల అధ్యక్ష పదవులకు,మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు,అలాగే రాష్ట్ర కమిటీలో పదవుల కోసం నేతలు దరఖాస్తులు సమర్పించారు.

# కార్మికుల హక్కుల కోసం కెత్తెర కదిలింది



**ఆర్టీసీ కార్మికుల గొంతుకగా బహుజన వర్కర్స్ యూనియన్‌తో టీఆర్పీ**

**టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా**

కరీంనగర్,అక్టోబర్ 03 (వాయిస్ టుడే): ఆర్టీసీ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం బహుజన వర్కర్స్ యూనియన్‌కు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. టీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్నసూచన మేరకు ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బహుజన వర్కర్స్ యూనియన్‌కు మద్దతుగా కరీంనగర్ జిల్లాలో పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బహుజన వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కుమార్ కురుమ ఆధ్వర్యంలో జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కంసారపు కోమల, రామచంద్రం బృందంతో కలిసి టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ఆధ్వర్యంలో కరీంనగర్ వన్ డిపో,టూ డిపోలలో ప్రచారం నిర్వహించారు. హుజురాబాద్ డిపోలో జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, హుజురాబాద్ మండల అధ్యక్షుడు తెరిగమల్ల నాగార్జున ఆధ్వర్యంలో టీఆర్పీ నాయకులు కార్మికులను కలిసి బహుజన వర్కర్స్ యూనియన్‌కు మద్దతు కోరారు.ఈ సందర్భంగా బహుజన వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కుమార్ కురుమ,టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను కేవలం ఎన్నికల సమయంలో ప్రస్తావించి వదిలేయకుండా,వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడే యూనియన్ అవసరమని అన్నారు.ఆర్టీసీ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత,పెండింగ్ ప్రయోజనాలు,డ్రైవర్లు,కండక్టర్లు, గ్యారేజీల్లో పనిచేస్తున్న మెకానిక్స్, మెస్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బహుజన వర్కర్స్ యూనియన్ ప్రకటించిన 26 హామీలను ఎన్నికల్లో గెలిచిన ఆరు నెలల్లోపు అమలు చేయకపోతే యూనియన్‌ను రద్దు చేసుకుంటామని తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జవాబుదారీతనం ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ విధమైన స్పష్టమైన హామీని ప్రకటించామని పేర్కొన్నారు.ఆర్టీసీ కార్మికుల సమస్యల్లో ముఖ్యమైన 'సర్వీస్ ఫర్ రిమూవల్' వంటి అంశాలను తొలగించేందుకు పోరాటం చేస్తామని, కార్మికులకు అన్యాయం జరుగుతోందని భావిస్తున్న 1968 జీఓపై కూడా పోరాటం చేస్తామని నాయకులు తెలిపారు. డ్రైవర్లు,కండక్టర్లు,గ్యారేజీ సిబ్బంది,ఇతర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మేనిఫెస్టోలో స్పష్టమైన హామీలు పొందుపరిచామని చెప్పారు.ఆర్టీసీ సంస్థను బలోపేతం చేయడంతో పాటు కార్మికుల హక్కులను కాపాడటం,ఉద్యోగ భద్రతను పరిరక్షించడం,పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపించడం కోసం బహుజన వర్కర్స్ యూనియన్ ముందుకు వచ్చిందని వారు తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో 12 యూనియన్లు పోటీలో ఉన్న నేపథ్యంలో కార్మికుల సమస్యలు,హక్కులు,ఉద్యోగ భద్రత వంటి అంశాలే ప్రధాన చర్చగా మారాయి.కార్మికుల భవిష్యత్తు కోసం ఓటు హక్కుల పరిరక్షణ కోసం ఓటు బహుజన వర్కర్స్ యూనియన్‌కు ఓటు అని పిలుపునిచ్చారు. బహుజన వర్కర్స్ యూనియన్ ఎన్నికల గుర్తు కెత్తెర అని,ఆర్టీసీ కార్మికులు తమ అమూల్యమైన ఓటును కెత్తెర గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని టీఆర్పీ నాయకులు కోరారు.కార్మికుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా,హక్కుల కోసం పోరాడే సంఘంగా బహుజన వర్కర్స్ యూనియన్‌ను బలోపేతం చేయాలని, ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తు కోసం ఐక్యంగా నిలబడాలని వారుపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ,మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ దేవి, కార్యదర్శి ఇశ్రత్ శావాలి,జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహ్మద్ వాజిద్, ప్రధాన కార్యదర్శి అంకుష్ శావాలి,వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్షత్ బిన్ అలీ,టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్,కొత్తపెల్లి మండల అధ్యక్షుడు ఓర్సు రాజు,నాయకులు మావురపు కనకయ్య, నేదునూరి కుమార్,రాజు,మాదం ఐలయ్య, సురేష్,సుమన్,సీను పాల్గొన్నారు.



## ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రతి విద్యార్థి మంచిగా చదవాలి.. ఆటలు ఆడాలి..అన్ని రంగాల్లో రాణించాలి.**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**మహాత్మా జ్యోతి బాపూలే విద్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 03 (వాయిస్ టుడే) ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని.. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి లోని మహాత్మా జ్యోతి బాపూలే విద్యాలయాన్ని శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భం గా విద్యాలయం లోని స్టోర్ రూమ్ లో బియ్యం, కూరగాయలు, పండ్లు, నెయ్యి నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. ఈ రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించారా అని ఆరా తీశారు. నెలలో నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్, ప్రతి రోజూ గుడ్డు ఇస్తున్నారా అడిగి తెలుసు కున్నారు. ఆర్ఓ ప్లాంట్ ను పరిశీలిం చారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని.. దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రవేశానికి చాలా మంది పోటీ పడతారని, మంచి అవకాశం వచ్చిందని, వినియోగించు కోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, దీనిని పరిశీలించేం దుకు ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయా ల్లో తనిఖీ కోసం ఒక మండల స్థాయి అధికారులను కేటాయించామని వివరించారు. వారు విద్యాలయం తనిఖీ చేసి.. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దీంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.తరగతి గదులు, వసతి గదులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, విలువైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. విద్యార్థులు రోజూ ఆటలు ఆడాలని.. సంగీతం, డ్యాన్స్ నచ్చిన విభాగంలో ఉండాలని సూచించారు.మంచిగా చదివి తమ ప్రాంత విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలవాలని ఆకాక్షించారు. విద్యార్థులు వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.

## ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన ఇండియా క్రికెట్ టీం

**ఫైనల్స్ లో పాకిస్తాన్ పై ఘనవిజయం సాధించిన టీమిండియా**

**గోల్డ్ మెడల్ సాధించిన భారత క్రికెట్ జట్టుకు ం అభినందనలు తెలిపిన యాదగిరి సునీల్ రావు**



కరీంనగర్,అక్టోబర్ 03 (వాయిస్ టుడే): జపాన్ లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన క్రికెట్ పోటీలలో భారత పురుషుల క్రికెట్ జట్టు ఆల్ రౌండ్ ప్రదర్శనతో బంగారు పతకం సాధించడం పట్ల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,కరీంనగర్ మాజీ మేయర్,ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు భారత క్రికెట్ జట్టుకు,క్రీడాకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ఆసియా క్రీడల్లో క్రికెట్ ఆటను చేర్చిన తొలిసారిలోనే భారత పురుషుల జట్టు ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం దేశానికంతటికీ ఎంతో గర్వకారణమని కొనియాడారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ రోమాంచక మ్యాచ్‌లో భారత యువ బ్యాటర్లు అభిషేక్ శర్మ, తిలక్ వర్మలు ఆఫ్ సెంచరీలు సాధించి తమ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శనతో పాకిస్తాన్ పై విరుచుకుపడి జట్టు స్కోరును 20ఓవర్లలో 200 పరుగులు దాటించడంలో విరోచితమైన, కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. అనంతరం భారత బౌలర్లు అత్యంత కట్టుదిట్టమైన బౌలింగ్ దాడితో పాకిస్తాన్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టి,ప్రత్యర్థి దాయాది జట్టును కేవలం 192 పరుగులకే పరిమితం చేశారని తెలిపారు. బౌలర్లు,బ్యాటర్లు సమష్టిగా రాణించడంతోనే భారత్‌కు ఈ చారిత్రాత్మక విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. పాకిస్తాన్ పై సాధించిన ఈ విజయం ప్రతి ఒక్క భారతీయుడి హృదయాన్ని ఉప్పొంగేలా చేసిందని యాదగిరి సునీల్ రావు వ్యాఖ్యానించారు.భారతదేశం, పాకిస్తాన్ మధ్య జరిగే ప్రతి మ్యాచ్‌ను కోట్లాది మంది అభిమానులు ఎంతో ఆసక్తితో, ఉత్సాహంతో వీక్షిస్తారని, అటువంటి ప్రతిష్టాత్మకమైన పోరులో నెగ్గి పసిడి పతకం సాధించడం దేశ ప్రజలందరికీ ఎనలేని సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ఒక సగర్వ భారతీయుడిగా ఈ విజయం పట్ల తాను ఎంతో గర్విస్తున్నానని తెలిపారు.క్రికెట్‌లో నయా చరిత్ర సృష్టించిన భారత క్రికెట్ జట్టు సభ్యులకు,కోచింగ్ సిబ్బందికి, క్రీడాభిమానులకు శుభాకాంక్షలు తెలుపుతూ,మున్ముందు కూడా భారత క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై మరిన్ని అద్భుత విజయాలు సాధించి దేశ కీర్తి పతాకాన్ని నింగికెత్తాలని ఆకాంక్షించారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత

**కరీంనగర్‌లో ఆకట్టుకుంటున్న 'ఏకాం' ప్రదర్శన**

**ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రారంభించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్**




కరీంనగర్,అక్టోబర్ 03(వాయిస్ టుడే): మహిళా పారిశ్రామికవేత్తలు తమ స్వయంశక్తితో ఆర్థికంగా ఎదుగుతూ,పది మందికి ఉపాధి కల్పించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మాజీ మంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు.స్థానిక ఉత్పత్తులకు ప్రజలు అండగా నిలవాలనే ఉద్దేశంతోకరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే మైదానంలో 'ఏకాం' సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం ఘనంగా ప్రారంభించారు.నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులకు ఘన స్వాగతం పలికి,శాలువాలతో సత్కరించారు.ప్రదర్శన ప్రారంభం అనంతరం అతిథులు వివిధ స్టాళ్లను కలయతిరిగి పరిశీలించారు. మున్మున్ సేన్,రోజా,విశాల్ మరియు మిత్రబృందంతో పాటు పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు తమ నైపుణ్యంతో రూపొందించిన వస్తువులను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు.మార్కెట్‌లో సాధారణంగా లభించని అనేక ప్రత్యేకమైన హ్యాండ్‌మేడ్ క్రాఫ్ట్స్,అందమైన చీరలు, గాజులు,మెహందీ ఉత్పత్తులు మరియు మహిళలకు అవసరమైన వస్తువులు ఇక్కడ కొలువుదీరాయి.పెద్ద షాపుల్లో అధిక ధరలకు లభించే కొన్ని హ్యాండ్‌మేడ్ ఉత్పత్తులు నేరుగా తయారీదారుల నుంచే అందుబాటులోకి రావడంఈ ప్రదర్శన ప్రత్యేకత.రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మహిళలకు,గృహాలకు అవసరమైన అనేక రకాల ఉత్పత్తులు ఈ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరాయని నిర్వాహకులు తెలిపారు.చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ తమ కాళ్లపై తాము నిలబడుతున్న మహిళలకు 'ఏకాం' చక్కటి వేదికగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎగ్జిబిషన్‌ను సందర్శించడమే కాకుండా,సోషల్ మీడియా ద్వారా ఈ ఉత్పత్తులను మరింత మందికి పరిచయం చేయాలని పిలుపునిచ్చారు.రెండు రోజుల ప్రదర్శనకు ప్రజల నుంచి లభించే ప్రోత్సాహాన్ని బట్టి భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి,మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్,మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్,కార్పొరేటర్ గడ్డి ప్రదీప్,మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ,మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్,బీఆర్ఎస్ నాయకులు గంగాధర చందు, నారదాసు వసంత రావు,మిడిదొడ్డి నవీన్,పబ్బతి శ్రీనివాస్ రెడ్డి,ఎండీ అఫ్రోజ్,శ్రావణ్ పాల్గొన్నారు.



## దుర్గ నవరాత్రి ఉత్సవాలకు పోలీస్ కమిషనర్‌కు ఆహ్వానం

కరీంనగర్,అక్టోబర్ 03 (వాయిస్ టుడే): టవర్ సర్కిల్‌లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహించే దుర్గ నవరాత్రి ఉత్సవాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరుతూ కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ సీపీ గౌస్ అలం ను మర్యాదపూర్వకంగా కలిశారు. యూత్ అసోసియేషన్ సభ్యులతో సీపీ గౌస్ ఆలం ను కలిసిన సర్దార్ రవీందర్ సింగ్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తెలియజేసి, కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానపత్రం అందజేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే దుర్గ నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.



## విద్యుత్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన విజేందర్ రెడ్డి

**ఎమ్మెల్యే గంగులను కలిసిన నూతన అధికారి**

కరీంనగర్,అక్టోబర్ 03 (వాయిస్ టుడే): కరీంనగర్ విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన యుగేందర్ రెడ్డి,మాజీ మంత్రి,కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన విజేందర్ రెడ్డికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శాలువా కప్పి,పూల మొక్కను అందజేసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్.మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్ రావు,పలువురు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.




## అంగన్ మిలన్ సేవ కార్యక్రమం

సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 03 (వాయిస్ టుడే): " సేవా సంకల్ప్ అభియాన్"లో భాగం గా సిరిసిల్ల పట్టణ కేంద్రం లో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు భీమనపల్లి శోభ ఆధ్వర్యం లో "అంగన్ మిలన్ సేవ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథి గా బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి హాజరై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను చిరు సన్మానంతో సత్కరించారు. సమాజ సేవలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, జిల్లా అధికార ప్రతినిధి రాజాసింగ్, జిల్లా ఆఫీస్ ఇన్‌చార్జ్ భాగన్న, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, ధార్మిక సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, పట్టణ అధ్యక్షులు మోర శ్రీహరి, సీనియర్ నాయకులు గూడూరు భాస్కర్, గజబింకర్ చందు, బీజేపీ సిరిసిల్ల మున్సిపల్ 1వ వార్డు ఇన్‌చార్జి బూర విష్ణు, 38వ వార్డు ఇన్‌చార్జి మోర శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



## తప్పుడు వార్తలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై పిర్యాదు

కరీంనగర్,అక్టోబర్ 03 (వాయిస్ టుడే): రాజీవ్ చౌక్ అభివృద్ధి అక్రమాల కలకలం అని మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మౌనంపై ఆంతర్యమేమిటని తెలంగాణ అడ్డా అనే పిడిఎఫ్ పేపర్ ద్వారా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ మా నాయకునిపై వ్యక్తిగతంగా పరువు నష్టం చేయాలనే దుర్బుద్ధితో కావాలని చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆస్తపురం రమేష్, ఎండి చాంద్,ఎండి మిరాజ్, సయ్యద్ ఖలీల్,మహమ్మద్ భారీ టుటౌన్ సిఐ కి ఫిర్యాదు చేశారు. అసలు వాస్తవం ఏమిటంటే ఆ రాజీవ్ చౌక్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి గానీ చౌక్ సుందరీకరణకు సంబంధించి గానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా సుడా నిధులు చెల్లించలేదు అసలు ఎంబి రికార్డే కాలేదు.ఇదేది కాకుండా అక్రమాల కలకలం అని విజిలెన్స్ విచారణ జరుగాలని మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మౌనం వెనుక ఆంతర్యమేమిటని ప్రచారం చేయడాన్ని తీవ్రంగా పరిగణించి సోషల్ మీడియాలో అజీమ్ మహమ్మద్ అనే వ్యక్తి ద్వారా పోస్టు చేస్తూ వ్యక్తిగతంగా డ్యామేజ్ చేయాలని చూస్తున్నారని దీని వెనుక ఎవరి హస్తం ఉందో కూడా ఎంక్వయిరీ చేయాలని కోరుచున్నారు.కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కోమటిరెడ్డిని ఎలాగైనా డ్యామేజీ చేయాలనే కుట్రలో భాగంగా సోషల్ మీడియా వేదికగా ఒక పిడిఎఫ్ పేపర్ ను ఆసరాగా చేసుకొని ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు పిర్యాదు చేశారు.

వాయిస్

హైదరాబాద్
ఆదివారం 4 అక్టోబరు 2026

# ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్ట్ వ్యవస్థ అవసరం

## మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి

నల్గొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03 (వాయిస్ టుడే ): ప్రజల పక్షాన పని చేసే జర్నలిజం వ్యవస్థ అవసరమని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టులు వృత్తి గౌరవాన్ని నిలబెట్టేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సామాజిక మాధ్యమాలపై నిర్వహించిన ఒకరోజు వర్క్ షాప్ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని మెరుగైన జర్నలిజాన్ని ప్రజలకు అందించేందుకు, అలాగే వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా జర్నలిస్టులకు ఉపయోగపడుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నల్గొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులకు ఉద్దేశించి ఒక రోజు వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే అక్టోబర్ 12న నాగార్జునసాగర్ లో కూడా నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,



సామాజిక మాధ్యమాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జర్నలిజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా ప్రభావం చాలా ఎక్కువగా ఉందని, దీన్ని సక్రమంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పత్రిక స్వేచ్ఛ, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా, విస్తృతార్థాలు, వర్కింగ్ జర్నలిస్ట్, వృత్తి పరమైన జర్నలిస్టులు తెలుసుకోవాల్సిన ప్రధాన చట్టాలు ,తదిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిజిల్ ఇంటెలిజెన్స్ వచ్చిన తర్వాత ప్రతి పౌరుడు జర్నలిస్టులా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి పరిస్థితులలో వార్తల్లో ఏది నిజం, ఏది అబద్దమో ప్రజలకు తెలిసేలా వార్తలందించాలని, ఏ ఐ,సోషల్ మీడియా వాడకాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా ఇది జర్నలిస్టులకు ఎంతో అవసరమని అన్నారు. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో మంచి తోపాటు, చెడు కూడా సంభవించే అవకాశం ఉందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సద్వినియోగం అయ్యేలా జర్నలిస్టులు కృషి చేయాలని, రిపోర్టర్లు నిరాధార వార్తలు రాయవద్దని కోరారు. ఈ సందర్భంగా ఆర్టిఫిజిల్ ఇంటెలిజెన్స్ పై టైమ్స్ అఫ్ ఇండియా ఎడిటర్ ఇన్వెస్టిగేషన్ ఉడుముల సుధాకర్ రెడ్డి, సోషల్ మీడియా పై నరసింహస్వామి లు జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, నల్గొండ జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు ,జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ ఓ ఎస్ డి రహమాన్,పి ఆర్ ఓ శైలేశ్వర్ రెడ్డి, దోటి శ్రీనివాస్ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేడ్కర్ క్లబ్ బలోపేతానికి కృషి చేయాలి

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్,అక్టోబర్ 03 (వాయిస్ టుడే): నగరంలోని రెండవ డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లిలో నూతనంగా ఎన్నికైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మాజీ మంత్రి,స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సంఘం సర్వతోముఖాభివృద్ధికి,బలోపేతానికి సభ్యులంతా ఐక్యతతో కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.నూతన కార్యవర్గ సభ్యులుగాగౌరవ అధ్యక్షులు జంగపల్లి మల్లయ్య,అధ్యక్షులు నెరువట్ల శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు గసికంటి హరి దర్శన్,ప్రధాన కార్యదర్శి సుంకే రామకృష్ణ,కోశాధికారి కనకం కుమార స్వామి,జాయింట్ సెక్రటరీ కొంకటి ప్రవీణ్ కుమార్,సంయుక్త కార్యదర్శి కోలాపురి సంజీవ్,ప్రచార కార్యదర్శి జకినపల్లి అజయ్,ఆఫీస్ ఇంచార్జి ఆరెపల్లి సిద్దార్థ ఎన్నికయ్యారు.



## హిందూ సనాతన ధర్మం చాల గొప్పది

శివ్వంపేట అక్టోబర్ 3 వాయిస్ టుడే : ఈ ప్రపంచంలో హిందూ సనాతన ధర్మం చాలా గొప్పదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ రెడ్డి సతీమణి రజిత రెడ్డి పేర్కొన్నారు. శనివారం శివ్వంపేట మండలం గూడూరు గ్రామ శివారులోని శ్రీ గురుపీఠం లో కొలువైన శ్రీ దత్తాత్రేయ మహా స్వామి పంచాయతనం పంచవటి శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో ఆమె తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శాస్త్రుల నటరాజ్ శర్మ ఆధ్వర్యంలో అర్చన, న్యాసపూర్వక రుద్రాభిషేకం, బాబాకు అర్చన, హారతి, మహా మంగళ నీరాజనం అలాగే వివిధ రకాల పూజలు చేపట్టారు. అనంతరం సుభాష్ రెడ్డి కుటుంబ సభ్యులను బాబా శాలువా, దత్తాత్రేయ స్వామి విశేష వస్త్రాలతో రజిత రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను సన్మానించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ప్రముఖ హైకోర్టు న్యాయవాది శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు, ట్రస్టు సభ్యులు సూర్య కుమార్ గౌడ్, రాజం బిక్షపతి యాదవ్, జి శ్రీనివాస్ గౌడ్, నోముల హనుమంతు, సిబ్బంది కే. సత్యనారాయణ గౌడ్ భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.



## జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలి

### అక్టోబర్ 10న దేశవ్యాప్త నిరసనలకు పిలుపు.: బి. వెంకట్

భద్రాచలం, అక్టోబర్ 03 : దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ కు వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, వాటిని మరింత బలోపేతం చేయాలని, అక్టోబర్ 10న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, డివైఎఫ్ ఐ నాయకులు వెంకటేష్, రామన్న, కోట రమేష్ పిలుపునిచ్చారు. వారు శనివారం మీడియా తో మాట్లాడుతూ సర్ పేరు తో దేశ ప్రజల ఓటు హక్కుపై తీవ్ర దాడి జరుగుతోందని అన్నారు. అర్హులైన కోట్లాది మంది పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన తర్వాత కూడా జ్ఞానేష్ కుమార్ పదవిలో కొనసాగడం ప్రజాస్వామ్యానికి అవమానకరమని వెంకట్ విమర్శించారు.

“ఎన్నికల కమిషన్ ప్రజల ఓటు హక్కుకు కాపలాదారు గా ఉండాలి కానీ అదే సంస్థ అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలకు సాధనంగా మారితే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని అన్నారు. అక్టోబర్ 10 పిలుపు మూడు ప్రధాన డిమాండ్లు తో ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్రపతి పై ఉందని బి. వెంకట్ అన్నారు. ఎన్నికల ప్రక్రియపై దేశవ్యాప్తంగా తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకుని జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సర్ ప్రభావం సమాజంలోని అత్యంత బలహీన వర్గాలపై మాత్రమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఉత్పత్తి వర్గాలపై, యువతపై కూడా తీవ్రంగా పడుతోందని బి. వెంకట్ అన్నారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు,వలస కార్మికులు, పట్టణ పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, చిన్న రైతులు, కౌలు రైతులు, నిర్మాణ, పారిశ్రామిక, అసంఘటిత రంగ కార్మికులు సర్ లో ఓటు హక్కు కోల్పోతున్నారని వెంకట్ అవేదన వ్యక్తం చేసారు.

“పేదవాడి దగ్గర పత్రాలు అడిగి, అతని పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించడం అంటే కేవలం ఓటును తొలగించడం కాదు; ప్రజాస్వామ్యంలో అతని ఉనికినే ప్రశ్నించడం. యువత భవిష్యత్తును, కార్మికుల హక్కులను, పేదల రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయడమే” అని బి. వెంకట్ అన్నారు. అక్టోబర్ 10 న

ప్రతి గ్రామంలో, ప్రతి బస్తీలో, ప్రతి కార్మిక వాడలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాల నీ వెంకట్ కోరారు.

## బిఎస్పి గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా మల్లవల్లి జ్యోతి నియామకం




విజయవాడ(వాయిస్ టుడే): కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఇన్‌చార్జిగా మల్లవల్లి జ్యోతి నియమితులయ్యారు. విజయవాడలోని ప్రసిద్ధ ఐలాపురం హోటల్‌లో శనివారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా బిఎస్పి కృష్ణా జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు, మల్లవల్లి జ్యోతికి నీలి రంగు కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, బహుజనుల, వెనుకబడిన వర్గాల హక్కుల పోరాటానికి జ్యోతి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే గన్నవరంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు గుడివాడ విమల్, నర్రం నాగమణి, ఎం. భవాని, కె. రాము, లావణ్యతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు ఆహ్వానం



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్03: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ఈవో, పూజారులు భైంసా పట్టణంలోని ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ కి అందజేసి, ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు, కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగాలని కోరుకున్నారు.



## కాకా వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా అక్టోబర్-03 వాయిస్ టుడే: మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ కాకా వెంకటస్వామి తొంభై ఏడవ జయంతి వేడుకలను అక్టోబర్ ఐదవ తేదీన అధికారికంగా నిర్వహించనున్న సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శి, కాకా యువసేన సభ్యులు ఆరెపల్లి రాహుల్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాకా వెంకటస్వామి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాకా వెంకటస్వామి అభిమానులు, యువసేన సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జయంతి కార్యక్రమం విజయవంతంగా జరిగేలా మున్సిపల్ అధికారులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గాజుల రాజమల్లు, సుల్తానాబాద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, ఐఎన్టియూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శంకర్, మాజీ సర్పంచ్ బొల్లం లక్ష్మణ్, నాయకులు జొన్నల రవీందర్, దరాడే శ్యామ్, గడ్డం సతీష్, కనుకుంట్ల శ్రీనివాస్, దేవేందర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు..

## మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా అక్టోబర్-03 వాయిస్ టుడే: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం భూపతిపూర్ గ్రామంలో స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో రూ.1.15 కోట్లతో ఏర్పాటు చేసిన చైతన్య జ్యోతి పెట్రోల్ పంపును జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు వడ్డీలేని రుణాల పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచామని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 15,715 స్వశక్తి సంఘాలకు ముప్పై మూడు కోట్ల రుణాలు అందించామని పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ పంపులు, చిరు వ్యాపారాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.స్వశక్తి సంఘాల మహిళలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, సహజ మరణానికి రెండు లక్షలు, ప్రమాద మరణానికి పది లక్షల బీమా అందిస్తున్నట్లు తెలిపారు. యాసంగిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి బదులు ఆయిల్‌పామ్, కూరగాయలు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.ఈకార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్, సింగిల్ విండో చైర్మన్లు, డీఆర్‌డీఓ ఖాలిందిని, అదనపు డీఆర్‌డీఓ రవీందర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వశక్తి సంఘాల మహిళలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## పాములపాడు పాఠశాలలో విద్యార్థులకు షీ టీం అవగాహన

మాడ్గులపల్లి,అక్టోబర్ 03(వాయిస్ టుడే ): నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలు, షీ టీం సీఐ మంజుల సూచనల మేరకు మిర్యాలగూడ షీ టీం ఆధ్వర్యంలో మాడ్గులపల్లి మండలం పాములపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మిర్యాలగూడ షీ టీం హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ మౌజీస్ హుస్సేన్, కానిస్టేబుళ్లు రాజేశ్వరి, మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ పై చట్టపరమైన చర్యలు, సైబర్ క్రైమ్ మోసాలు, ఆన్ లైన్ అప్రమత్తత, విద్యార్థినులకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిర్మూలన, ద్విచక్ర వాహనంపై హెల్మెట్, ఫోర్ వీలర్ లో సీట్ బెల్ట్ ఆవశ్యకత, డయల్ 100, షీ టీం వాట్సాప్ నంబర్ ద్వారా ఫిర్యాదు చేసే విధానంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మౌజీస్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యంతో చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వడ్డే వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వి.కోటిరెడ్డి, డి.సుమతి, వల్లపుదాసు సతీష్ కుమార్, ఎల్.సోమాని, జి.విజయ్ కుమార్ రెడ్డి, ఆర్.సాంబయ్య, ఇ.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్కల్‌లో రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ

### ఆత్మ నిర్భార్ పథకం కింద శనగ విత్తనాల పంపిణీ




జహిరాబాద్ వాయిస్ టుడే అక్టోబర్ 03: న్యాల్కల్ మండలంలోని రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఆత్మ నిర్భార్ పథకం కింద న్యాల్కల్ మండలంలోని రైతులకు ఎస్ఈబీజీ--452 రకం శనగ విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేశారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేసుకునే పప్పుదినుసుల పంటలను ప్రోత్సహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, సొసైటీ చైర్మన్ సిద్దయ్య స్వామి, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డితో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**